



మా వూరికి కొందరు దేవతలు రానున్నట్టు వార్త వచ్చింది. వూళ్ళో వాళ్ళం రకరకాలుగా మాట్లాడుకున్నాం.

"అన్నీ వొట్టిదే."

"వచ్చేవాళ్లు దేవతలుకారు"

"స్వర్గమంటూ, దేవతలంటూ ఉన్నారనుకోవటం మూఢ నమ్మకం. దూరపు కొండలునునుపు. దగ్గిరికిపోయి చూస్తే అన్నీ మన దేశంలాంటివే. అందరూ మన లాంటివాళ్ళే.

మాలో వున్న మానవత్వం ఎంతో మాకు తెలీదా? ఉన్న వాళ్ళూ లేనివాళ్ళూ కూడా గడ్డితింటున్నారు. ఉన్నవాళ్ళు సంచులు నింపుకోటానికి లేనివాళ్ళు పొట్టనింపుకోటానికీ, నీతికీ, న్యాయానికీ, నికీ వినియోగంలేక బజారులో అమ్మకానికి వచ్చాయి, తాహతుగల వాళ్ళు వాటిని కొనుక్కుని వాటితో భోగిమంటలువేసి చేతులు వెచ్చ బెట్టుకుంటున్నారు. మానవరక్తం నపుంసకమైపోయింది. ఘోర పైశాచిక శక్తులు ఎట్టెదురుగా నగ్ననృత్యాలు చేసినప్పటికి దానికి ఉద్రేకం కలగదు. కళలను శూర్పణఖా సన్మానంచేశాం. వాటిముక్కు నాలుకలు కొయ్యటమేకాక చెవుల్లో సీసంకరిగించిపోశాం. వాటి ఆటకట్టె

ఎక్కడో మాకన్న గొప్పవాళ్ళున్నారంటే మేం ఎట్లా నమ్ముతాం? మాకు అభిమానం చచ్చినా అహంకారం చావలేదు. నిర్మాణశక్తులడుగంటినా విధ్వంసకశక్తులు చావలేదు. వెన్ను విరిగినా, మెదడు బద్దలైనా కొండి ఆడుతూనే ఉంది.

**శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు**

క్షమించండి, నేను ఈ విషయాలు మావూళ్ళో అందరి తరఫున చెబుతున్నాననుకునేరు. ఉదయం ఫ్యాక్టరీకూ, మధ్యాహ్నం ఆఫీసుకూ లేక దుకాణానికీ, సాయంకాలం క్లబ్బుకూ లేక వాహ్యాళికీ, రాత్రి సినిమాకూ లేక మరోచోటికీ వెళ్ళేవాళ్ళ తరఫునే ఈ మాట చెబుతున్నా. మా ఊళ్ళో కూలి నాలి చేసుకునేవాళ్ళూ, కూలినాలికోసం అడుక్కునేవాళ్ళూ, తిండికోసం అడుక్కునేవాళ్ళూ, డొక్కలో కాళ్ళు దూర్చుకుని చెట్లకిందా చేమలకిందా నివసించేవాళ్ళూ ఉన్నారు. వాళ్ళని మేం మనుషుల్లో జమకట్టం. మమ్మల్ని గురించి మాకు ఎంత తక్కువ అభిప్రాయం ఉన్నా వీళ్ళను గురించి ఇంకా తక్కువ అభిప్రాయమే కలిగిఉంటాం. అది మా సహజధర్మం. ఈ ఒక్క ధర్మాన్ని మేం విధిగా అనుష్ఠించుతాం.

* * *

దేవతలు మావూరు వేంచేస్తున్నారన్న వార్త ప్రబలంకావటమే కాక వారు వచ్చే తేదీకూడా ప్రకటించబడింది. మళ్ళీ వ్యాఖ్యానాలు సాగాయి.

"వచ్చిందాకా నమ్మటానికి వీలులేదు."

"వాళ్ళు దేవతలైతే ఈ వూరెందుకు వస్తారు? ఇంకే వూరైనాపోక!"

"దేవతలు వస్తేమాత్రం మనను ఉద్ధరించేదేమిటి పోనిస్తూ!"

మమ్మల్ని చూస్తేగాని మావూరు చూస్తేగాని మాకు లేశమాత్రమైనా అభిమానం లేదు. ఇది ఆధారం చేసుకుని పైవాళ్ళు మమ్మల్నిగాని మా వూరునుగాని ఏమన్నా అన్నారంటేమాత్రం చంపేస్తాం. అది మా ప్రత్యేకత.

ఈ దేవతల రాకగాదుగాని ఊళ్ళో అట్టహాసం జాస్తి అయింది. క్లబ్బులో ఒక మీటింగు. పార్కులో ఒక మీటింగు చౌకులో ఒక మీటింగు. ఆహ్వానసంఘాలు ఏర్పాటవుతున్నాయి. డబ్బు వసూలవుతున్నది. పోస్టర్లు అంటిస్తున్నారు.

ఇదంతా చూసి మేం ఏవగించుకున్నాం. ఎవరు దేశకిగాను కృషి చేస్తున్నా మాకు ఏవగింపే, వీళ్ళంతా తమ మానాన తాముంటూ వుండలేరూ? అన్ని యత్నాలూ నిష్ఫలమేనని మాకు తెలుసు. చివరకు ఏమీ ఉండదు. అసలు బతుకే భారం. దాన్ని మరింత భారం చేసుకుంటారెందుకు? అదీ మా వేదాంతం.

దేవతలకు సన్మానం చేయ్యటం గురించి జరిగే ఏర్పాట్ల వివరాలు తెలియసాగాయి. మీసాలవంతులు ఆహ్వానసంఘాధ్యక్షులు. ప్రతిదానికి తగుదునమ్మా అంటూ ఆయన వస్తాడు. కిందటేడు కుస్తీలు పట్టేవాళ్ళొస్తే వాళ్ళ సన్మానానికీ ఈయనే అధ్యక్షుడు. ఆహ్వాన సంఘంలో ఖద్దరుకొట్టాయనా, బీడీలషాయిబూ, దళారా గిన్నెలాయనా ఇనప దుకాణం ఆయనా, చెవిటి ప్లీడరూ చేరారు. డబ్బుకూడా వసూలయింది.

* * *

దేవతలు వచ్చారు. రహదారి బంగళాలో మకాం చేశారు. రహదారి బంగళా బయట అనేక వేలమంది మూగారు. ఎర్రటోపీలు చేతికర్రలు ఆడించుకుంటూ తయారయాయి. శాంతి భద్రతలు కాపాడటానికి.

నేనుకూడా అక్కడికి వెళ్ళా. రకరకాల సంభాషణలు నా చెవిని పడ్డాయి.

"ఎంతమంది?"

"ఏమో? నలుగురని కొందరు ముగ్గురని కొందరు అంటున్నారు."

"ఎట్లా ఉన్నారు?"

"ఎవరు చూశారూ?"

"లోపలికి వెళ్ళి చూడకూడదూ?"

"మక్కెలు విరగదంతారు."

"లోప లెవరెవరున్నారు?"

"ఆహ్వానసంఘంవాళ్ళూ. వాళ్ళ పెళ్ళాలూ, పిల్లలూ, అత్త మరుదులూ, వాళ్ళ ఉంపుడుగత్తెలూ—"

ఒకగంటసేపు తారట్లాడి లాభంలేదనుకుని ఇంటికి వెళ్ళా.

సాయంకాలం క్లబ్బులో దేవతలకు విందు. ఆతరవాత పార్కులో మీటింగు.

టైముకు ముందే క్లబ్బు దగ్గరికి వెళ్ళా. క్లబ్బు ఆవరణచుట్టూ 16 అడుగుల ఎత్తున కొత్తగా తడికలు లేచి ఉన్నాయి. బయట వేలకు వేలు జనం కూడిఉన్నారు. లోపలికి ఎవర్నీ పోనివ్వటంలేదు. క్లబ్బు వాకిట్లో ఎర్రటోపీల ఘాటు. క్లబ్బు అవతల ఉన్న చెట్లమీదికి ఎవరూ ఎక్కకుండా చెట్ల మొదట్లో ముళ్ళకంప పెట్టారు. కంపకు కుమ్మక్కుగా రెండు ఎర్రటోపీలు.

"దేవతలకీ జై!" అనే నినాదం మిన్నుముట్టింది. జనం మధ్యగా కారువచ్చి క్లబ్బులోపలికి వెళ్ళిపోయింది. లోపల ఎవరున్నదీ చూడటం సాధ్యంకాలేదు.

ఆహ్వానాలు పొందినవాళ్ళకు మాత్రమే లోపలికి ప్రవేశం.

పార్కుకు వెళ్ళా.

అక్కడకూడా వేలాదిజనం చేరిఉన్నారు. అయితే అక్కడా తడికలు ఎత్తి ఉన్నాయి.

"ఇక్కడ జరిగేది బహిరంగసభ కాదా ?" అని అడిగా కనిపించిన వాళ్ళని.

"ఆహ్వానాలు పంపినవారికే ప్రవేశంట!"

ఆ సమయంలో అటుగా చైర్మనూ, బట్టలకొట్టు సెట్టిగారూ వచ్చారు

"ఏమండీ చైర్మనుగారూ, మీరిక్కడున్నారే? దేవతల విందుకుఅన్నా వెళ్ళలా ?"

నేను వాళ్ళ సన్మానాన్ని బాయికాట్ చేశాగా? ఇదంతా ఆ మీసాల పంతులు స్వంత ప్రదర్శనం. ఆ ఖద్దరుకొట్టు_కొడుకు మీన

సెట్టిగారిని ఆహ్వాన సంఘంలో కూడా లేకుండా చేస్తాడా? దేవతలు వీళ్ళ మేనమామ కొడుకులా! ఛీ! ఇటువంటి వెధవలు సన్మానం చేస్తుంటే సాక్షాత్తు మహావిష్ణువును కూడా బహిష్కరించవలసిందే."

చైర్మనుగారు వెళ్ళిపోయారు.

* * *

పార్కులో మీటింగు ప్రారంభమయింది. ఆహ్వానాలు గల వాళ్ళను మాత్రమే లోపలికి వెళ్ళనిచ్చారు. బయట దాదాపు 20 వేల మంది చేరి ఉంటారు.

"దేవతలకూ జై! మాకు దేవతల్ని చూపించండి," వకటే కేకలు.

గంటసేపు తారట్లాడి ఇంటికి వెళ్ళా.

ఆ రాత్రే దేవతలు వెళ్ళిపోయారు.

మర్నాడు పార్కులోనూ, క్లబ్బులోనూ తడికలు దించేశారు. వాటిని అమ్మి ఆ డబ్బు మీసాల పంతులూ, ఖద్దరు కొట్టాయనా పంచుకున్నారని తెలిసింది.

మూడు నాలుగు రోజులకు పత్రికలు చదివా?

"దేవతలకు అఖండ సన్మానం. ఫలానా గ్రామవాసులు దేవతలకు అఖండ సన్మానం చేశారు. క్లబ్బులో వైభవంగా విందు జరిగింది. దానికి రెండువేలమంది విచ్చేశారు. పార్కులో జరిగిన సభకు 20 వేల మంది హాజరైనారు. వివిధ వర్తకసంఘాలవారు దేవతలకు సన్మాన పత్రాలు సమర్పించారు. సన్మానాలకు సమాధానం చెబుతూ దేవతలు తమ స్వర్గంలో వ్యత్యాసాలు లేవని, అక్కడ అందరికీ జీవితం సుఖప్రదంగా చేయబడిందనీ, దేవతలందరూ శాంతి కాముకులనీ అన్నారు."

